సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



చారిత్రక బావి.. అభివృద్ధి చర్యలేవి?

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ఎంతో చారిత్రకత కలిగి, విశిష్టత ఉన్న దేవాలయం.ఇమాంబేగ్ బావి భక్తుల సందర్శనానికి నోచుకోలేదు. -8లో



టైరు పంక్చర్.. కారు బోల్తా

గొందిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. -8లో

గరిష్టం/కనిష్టం
33.4/25.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.2 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు కొత్త వీసీ బాధ్యతల స్వీకరణ



బెల్లకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్లర్‌గా బెల్లంకొండ రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నాలుగు మాస్టర్ డిగ్రీలు పొందిన ఆయన 1999లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో విశిష్ట సేవలందించారు. తాజాగా వైవీయూ వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు నూతన వీసీకి స్వాగతం పలుకుతూ వైవీయూ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీసులో స్త్రీశక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతాయన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందని తెలిపారు.


నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని కలెక్టరేట్ సభా భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం, పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చేవారు తమ వివరాలతో పాటు తమ సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అలాగే గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని ఆయన వివరించారు.. అర్జీదారులు తమ అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

కడప రైతుపైనా వివక్షే!

- కర్నూల్ జిల్లాలో ఉల్లిసాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం
- జిల్లాకు మొండిచేయి చూపడంపై రైతుల్లో ఆగ్రహం
- ఈ జిల్లావాసులు రైతులు కాదా?.. ప్రశ్నిస్తున్న రైతు సంఘ నాయకులు







మైదుకూరు ప్రాంతంలో పొలాల్లో వదిలేసిన ఉల్లిగడ్డలను తింటున్న జీవాలు , ధర లేకపోవడంతో ఎర్రగడ్డలను కాలువలో వదిలేస్తున్న రైతు ఓబులేసు

కడప అగ్రికల్చర్: చంద్రబాబుకు ఆది నుంచి కడపంటే కడుపుమంటే. ఓట్లు రావనో.. సీట్లు దక్కలేదనో సందర్భమొచ్చినప్పుడల్లా జిల్లాపై అక్కసు వెళ్లగక్కుతుంటారు. ఇక్కడికి కొత్త పరిశ్రమల మంజూరు మాటేమోగానీ.. ఉన్న పరిశ్రమలను పక్కజిల్లాలకు తరలిస్తుంటారు. తాజాగా జిల్లా రైతులపైనా కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా ఉల్లి రైతులకు పరిహారంపై వివక్ష చూపిస్తున్నారు. పొరుగునున్న కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం ప్రకటించిన కూటమి ప్రభుత్వం కడప జిల్లా రైతులను గాలికొదిలేసింది. గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు అసలే మద్దతు ధర లేక అవస్థలు పడుతున్న ఉల్లి రైతులకు చేతికొచ్చిన పంట వర్షాలకు చేలోనే కుళ్లిపోయింది. దీంతో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కష్టాల కడలిలో చిక్కి అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలబడాలి. పరిహారం ప్రకటించి చేయూతనివ్వాలి. సీఎం చంద్రబాబుకు ఆ మనసే లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో క్వింటా ఉల్లిని రూ. 1200 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని చెప్పి మోసం చేసిన ఆయన.. తాజాగా జిల్లా రైతులకు పరిహారం విషయంలోనూ దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు కురవడం.. ఉల్లి ధర అమాంతం పడిపోవడంతో రైతులు కుదేలయ్యారు. చేసేదీ లేక కొందరు రైతులు పొలాల్లోనే పంటను వదిలేయగా..మరికొందరు కాలువల్లో పారబోస్తున్నారు.


జిల్లా రైతులకూ ఇవ్వాల్సిందే..

కర్నూలు జిల్లా రైతులకు హెక్టారుకు 50 వేలు నష్టపరిహారం ప్రకటించినప్పుడు పక్కనే ఉన్న వైఎస్సార్ జిల్లాకు ఎందుకు ప్రకటించరని రైతులు.. రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరు సరికాదని తూర్పారబడుతున్నారు. జిల్లా రైతులకూ పరిహారం ప్రకటించాలని ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నేతలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. అలాగే ఉల్లిగడ్డలను మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విన్నవించారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

మొదటి నుంచి వివక్షే ...



కూటమి ప్రభుత్వానికి రైతులంటే మొదటి నుంచి వివక్షే. రైతుల సమస్యలను ఎక్కడా పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి రైతులకు కర్నూల్ జిల్లాకు హెక్టారుకు రూ. 50 వేలు పరిహారం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. దాని పక్కనే ఉన్న వైఎస్సార్‌జిల్లా రైతులను విస్మరించారు. దీనిని వివక్షకాక మరేమంటారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులను ఆదుకోవాలి.

– సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వ వైఖరి దుర్మార్గం



జిల్లాలో ఉల్లి పంట పండించిన రైతుల పట్ల ప్రభుత్వ వైఖరి దుర్మార్గం. ఉల్లిని క్వింటాల్ 1200 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని చేతులెత్తేసింది. దీంతో రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తే హెక్టారుకు 50,000 రూపాయలు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినప్పుడు ఉల్లి రైతులకు కొంత వరకైనా తమ నష్టాలు తగ్గుతాయని భావించాం. కానీ వైయస్సార్ జిల్లాలో పండించిన ఉల్లి పంట వెరైటీ రకం అనే సాకుతో పరిహారం ఇవ్వడం కుదరదని చెప్పడం దారుణం. – పోతిరెడ్డి బాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి(సీపీఐ రైతు విభాగం)

13 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వెలికి తీసే స్వీయ అంచనా-2(సెల్ఫ్ అసెస్‌మెంట్-2) పరీక్షలు ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్షా పత్రం ద్వారానే పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్షను క్లాస్ రూమ్ బేస్డ్ విధానంలో ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలను ఈ ఏడాది ప్రభుత్వం జారీ చేసిన అసెస్‌మెంట్ బుక్‌లోని ఓఎమ్మార్‌లో నిర్వహించనున్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

ఫార్మెటివ్-1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలి. ఏరోజు పరీక్షకు ఆరోజు ప్రశ్నపత్రాన్ని మాత్రమే తీసుకెళ్లి పరీక్ష నిర్వహించాలి. ఎక్కడా ఏ విధమైన పొరపాట్లు తలెత్తినా హెచ్‌ఎంలు, ఎంఈఓలు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

నేడు విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు

రాయచోటి: ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో వందల మందిని దాటుకొని బోధనను వృత్తిగా చేపట్టనున్న నూతన ఉపాధ్యాయులు సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలను చేపట్టనున్నారు. కొత్త టీచర్లు బాధ్యతలను చేపట్టనున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. నూతన ఉపాధ్యాయులు వారం రోజులపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణను కూడా పొందారు. సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టనున్న ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు. మంచి బోధనను అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.

గంగమ్మకు బోనాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పూజారులు చెల్లు గంగయ్య సురేంద్ర కుటుంబ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన జరిపారు. భక్తులు బోనాలు సమర్పించారు. గంగమ్మా..చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు.కొందరు తలనీలాలు అర్పించారు. ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు వారి సిబ్బందితో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారి అమ్మవారి విశిష్టతను పూజారులు వివరించారు. అలాగే మద్దిరేవుల గ్రామం, వంకగడ్డ రాచపల్లి సమీపంలో వెలసిన శ్రీశ్రీ మారెమ్మ దేవత అమ్మవారి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్డెమ్మా..కరుణించమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అమ్మా..చల్లంగా చూడమ్మా అని భక్తులు వేడుకున్నారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు.మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయానికి హిందువులతో పాటు ముస్లీంలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించడం గమనార్హం.

అనుమతి లేకున్నా బోటు షికారు

జమ్మలమడుగు రూరల్: పర్యాటక ప్రాంతమైన మైలవరం జలాశయంలో ఓ బోటు యజమాని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు. అధికారుల నుంచి అనుమతులు లేకున్నా అక్రమంగా బోటు షికారు నిర్వహిస్తున్నాడు. ఈ వ్యవహారం జలాశయం అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఇదే బోట్‌ను అధికారులు పట్టుకుని 6 నెలల పాటు సీజ్ చేశారు. కాగా, సీజ్ చేసిన బోట్‌ను అధికారులు ఇటీవల యజమానికి అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో సదరు యజమాని గండికోట, మైలవరం జలాశయంలో బోట్ షికారు చేపట్టినట్లు తెలుస్తుంది. ఈ విషయమై మైలవరం జలాశయం డీఈ రమేష్‌ను వివరణ కోరగా బోట్‌ను అక్రమంగా తిప్పుతున్నట్లు తమకు సమాచారం లేదన్నారు. ఒకవేళ తిప్పుతున్నట్లయితే చర్యలు తీసుకుంటామని వివరించారు.

సిట్‌తో సరిపెట్టేస్తారా?

- నకిలీ మద్యం కేసులో వెలుగులోకి వస్తున్న ఒక్కొక్కరు



ములకలచెరువు నకిలీమద్యం ప్లాంట్‌లో లభ్యమైన నకిలీమద్యం, లేబుళ్లు

మదనపల్లె: అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై, అందులో ప్రమేయం ఉన్న టీడీపీ నేతలపై సీబీఐ ద్వారా సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తుంటే.. ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సరి పెట్టేసింది. ఈ దర్యాప్తు రైట్ అవుతుందా లేదా అన్నది ముమ్ముందు చూడాలి. ములకలచెరువు నకిలీ మద్యం తయారీపై సిట్ దర్యాప్తు చేస్తుందని సీఎం చంద్రబాబు ఆదివారం ప్రకటించారు. ఇప్పటిదాకా ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించి అరెస్టుల ప్రక్రియ ప్రారంభించారు. రిమాండ్ రిపోర్టులను కూడా నివేదించారు. ప్రధానంగా టీడీపీ నేతల ప్రమేయంపై ఇప్పటిదాకా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఆరోపణలపై తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పీటీఎం టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వీరిలో సురేంద్ర నాయుడు పై తొలుత కేసు నమోదు చేయగా, తర్వాత అరెస్టు అయిన వారి వాంగ్మూలం ఆధారంగా జయచంద్రారెడ్డి, మరి కొందరిపై కేసు నమోదు చేశారు. అంతటితో చర్యలు ఆగిపోయాయి. నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో కీలక నేతలు, ముఖ్య నాయకులు ఎవరో ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు కూడా ప్రకటించలేదు. ఒకరి వెనుక ఒకరుగా అరెస్టు అవుతున్న నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా కొత్తగా నిందితులను చేర్చుతూ దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ కేసులో నిందితుల అరెస్టు ప్రక్రియనే పూర్తి కాలేదు. నకిలీ మద్యం తయారీ, వాటి సరఫరా గురించి మాత్రమే దర్యాప్తులో గుర్తించారు. నిజానికి ఈ నకిలీ మద్యం ఎవరెవరికి చేర్చారు.. ఏయే మద్యం దుకాణాలకు వెళ్లింది...ఎంత పరిమాణంలో తయారైంది అన్న వివరాలపై దర్యాప్తు అడుగు కూడా ముందుకు పడలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు సిట్ ఏర్పాటు చేయడంతో స్పష్టత వస్తుందా లేదా అన్నది చూడాలి.

కొనసాగుతున్న గాలింపు

ములకలచెరువు నకిలీమద్యం కేసులో ఇప్పటికి నిందితుల సంఖ్య 23. ఈ కేసులో 14 మందిని అరెస్ట్ చేశారు. మిగిలి వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.కాగా ఆరెస్ట్ అయిన నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టును ఆశ్రయించగా సోమవారం నిర్ణయం వెలువడనుంది.

- నకిలీమద్యం తయారీ ప్లాంట్ వ్యవహారం, తరలింపు, విక్రయాల్లో విజయవాడకు చెందిన అద్దేపల్లె జనార్దనరావుతో స్థానిక టీడీపీ నేతలంతా జత కట్టినట్టు స్పష్టం అవుతోంది. ఈ కేసులో అరెస్టయిన ఏ-1 జనార్దనరావు రిమాండ్ రిపోర్ట్‌లో పలు విషయాలు..టీడీపీ నేతలతో ఎంత గట్టి అనుబంధం ఉందో స్పష్టం చేసింది. మిత్రుడు జయచంద్రారెడ్డి గెలుపు కోసం ఆయనకు మద్దతుగా వెళ్లినట్టు పేర్కొన్నాడు. అక్కడ టీడీపీ నేతలతో పరిచయాలు, మద్యం వ్యాపారంలో నష్టాలు, లాభాల కోసం నకిలీ మద్యం తయారు..ఇలా అన్నింటికి టీడీపీ నేతలు కలసికట్టుగా జట్టుకట్టినట్టు నివేదికలే స్పష్టం చేస్తున్నాయి.

ప్లాంట్ ఏర్పాటులో వీరి పాత్ర

కేసులో ఏ-1 జనార్దనరావు ఏ-2 కట్టా రాజుకు ఫోన్ చేసి నకిలీమద్యం తయారీకి సంబంధించి చర్చించి, ప్లాంట్ ఏర్పాటులో ఎవరెవరి పాత్ర ఉందో రిమాండ్ రిపోర్ట్‌లో కట్టారాజు చెప్పినట్టు ఎక్సైజ్ పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు. కొడాలి శ్రీనివాసరావు పేరిట మూతపడిన డాబాను లీజుకు తీసుకున్నాక కాంపౌండ్ గోడను 10 అడుగులకు పెంచారు. త్వరలోనే నకిలీ మద్యం అమ్మకాలు ప్రారంభించాలని జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన బాలాజీ, హైదరాబాద్‌కు చెందిన నకిరేకంటి రవి, ఆంధ్రావైన్స్ లైసెన్స్‌దారు కట్టా సురేంద్రనాయుడు, రాక్‌స్టార్ లైసెన్స్‌దారు టి.రాజేష్ ప్రణాళిక వేశారు. బాలాజీ వాటర్‌ప్లాంట్, ఎస్ఎస్ ట్యాంకు, ఎలక్ట్రికల్ మోటారు, స్పిరిట్ డబ్బాలను షెడ్డుకు తీసుకొచ్చాడు. జనార్దనరావు, రవిలు లేబుళ్ల, పెట్ బాటిళ్ల, క్యాప్‌లు, హీల్స్‌ను తీసుకొచ్చారు. మూడు సీలింగ్ మిషన్లలో రెండింటిని జనార్దనరావు తన వాహనంలో రెండుసార్లు తీసుకొచ్చారు. తమిళనాడు కృష్ణగిరి ప్రాంతంలో డాబాల్లో పనిచేస్తున్న నలుగురిని బాలాజీ సహాయంతో జనార్దనరావు తీసుకొచ్చారు. జనార్దన రావు బార్‌లో పనిచేస్తున్న సయ్యద్ హాజీ ద్వారా ఒడిశా నుంచి ఇద్దరిని రప్పించి నకిలీమద్యం తయారీని ప్రారంభించి ప్రజలకు తాపించి వారి ఆరోగ్యంతో చెలగాటం అడారు.

నకిలీ మద్యంపై యుద్ధం

- గుడులు, బడుల పక్కన ఉండకూడదని వినతులు
- దోషులను కఠినంగా శిక్షించాలి
- వైన్‌షాప్‌ల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి, అనర్హులను తొలగించాలి
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన



నకిలీమద్యం ప్లాంట్‌లో మద్యం బాటిళ్లు, బాక్సులు



సాక్షి రాయచోటి: కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో నకిలీ మద్యం వ్యవహారం రచ్చ రేపుతోంది. ప్రధానంగా అన్నమయ్య జిల్లాలోని ములకల చెరువులో ఇటీవల బయటపడిన నకిలీ మద్యం వ్యవహారం కలకలం రేపింది. వివిధ రకాల బ్రాండ్లను స్వయంగా తయారు చేస్తూ మద్యం షాపుల ద్వారా బెల్ట్ షాపులకు పంపించిన వ్యవహారం బట్టబయలు కావడం, ప్రత్యేకంగా మిషనరీ పెట్టి నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడటం అందరికీ తెలిసిందే. జిల్లాలో పలు ప్రాంతాలకు బెల్ట్ షాపుల ద్వారా నకిలీ మద్యాన్ని సరఫరా చేసిన కొంతమంది టీడీపీ నేతలు అరెస్టు అయినా...కీలక నేతలు ఇంతవరకు అరెస్టు కాలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నకిలీ మద్యం వ్యవహారంపై ఆందోళనలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నేతలు ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ మద్యం వ్యవహారంపై సోమవారం ఎక్కడికక్కడ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టడంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నారు.

ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు

అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమైనా అధికారంలో ఉండడంతో టీడీపీ నేతలు ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులను ఏర్పాటు చేశారు. గుడి, బడుల పక్కన పెట్టకూడదన్న విషయాన్ని విస్మరించి సమీప ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారు. ఎవరూ అడిగే వారు లేరన్న ధైర్యమో...అధికారం ఉందికదా ఎవరు ఏమి చేయరన్న ధీమాతో ఎక్కడపడితే అక్కడ షాపులు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం...అందులో సంబంధీకులకే షాపులు రావడంతో ఎక్సైజ్ అధికారులు కూడా ఎందుకొచ్చిన తంటా అని ప్రశ్నించడం కూడా మానేశారని పలువురు చర్చించుకుంటున్నారు.

కీలక నేతల అరెస్టులు ఎప్పుడో?

అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువులో కలకలం రేపిన నకిలీ మద్యం వ్యవహారానికి సంబంధించిన కేసులో చోటా మోటా వారిని అరెస్టు చేసినా కీలక నిందితులను ఎప్పుడు అరెస్టు చేస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా ఈ కేసులో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగిన జయచంద్రారెడ్డితోపాటు ఆయన బావమరిది, పీఏలను ఇంకా అరెస్టు చేయలేదు. వారి కోసం అన్వేషిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నా జాడ కనిపెట్టలేకపోతున్నారు. కీలక నేత జయచంద్రారెడ్డి విదేశాల్లో ఉండగా, మిగిలిన వారు ఎక్కడున్నారన్నది అంతుచిక్కడం లేదు. కీలక నేతలు అరెస్టుల తర్వాత కస్టడీకి తీసుకుంటే ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు తెలియజేస్తున్నారు.

సీబీఐ విచారణకు డిమాండ్

అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు ప్రాంతంలో వెలుగుచూసిన నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాయడంతోపాటు సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. ఎందుకంటే ప్రస్తుత కూటమి సర్కార్ అధికారంలో ఉండడం, మరోవైపు టీడీపీ కీలక నేతలే నిందితులుగా ఉన్న నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ ద్వారా న్యాయం జరగదని....సీబీఐ అయితే పూర్తి స్థాయిలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పార్టీ నేతలు కోరుతున్నారు.

నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు

నకిలీ మద్యం వ్యవహారంపై జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు జరగనున్నాయి. నియోజకవర్గ కేంద్రాల్లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టడంతోపాటు వినతిపత్రాలను సమర్పించనున్నారు. ప్రధానంగా గుడులు, బడుల పక్కన వైన్‌షాపులు ఉండకూడదని, వైన్‌షాప్‌ల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించాలని, నకిలీ మద్యం వ్యవహారంలో ఎంతటి వారున్నా ఉపేక్షించకుండా అరెస్టుచేయాలని, అలాగే సీబీఐ దర్యాప్తు కోరాలని తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ ఆందోళన బాట పట్టింది. సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదులుతున్నాయి.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

దువ్వూరు : మండల పరిధి ఇడమడక గ్రామ సమీపంలోని పాడుబడిన డాబా వద్ద ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం యాదవవాడకు చెందిన అరుణ్‌కుమార్ (19) అనే యువకుడు ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి మండలంలోని ఇడమడక గ్రామ సమీపంలోని హైవేపై ఉన్న పాడుబడిన డాబా వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఆదివారం ఉదయం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడి ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలియడంతో భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు దువ్వూరు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన పి.గంగాదేవి(40) నాలుగు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... గంగాదేవి కనిపించడం లేదని ఈ నెల 9వ తేదీన పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆదివారం పాతసంగటిపల్లె గ్రామ సమీపంలోని జింకల వాగు వద్ద కుళ్లిన వాసన వస్తున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా గంగాదేవిగా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

పెట్రోల్ పోసుకొని వృద్ధుడి ఆత్మహత్య?

చింతకొమ్మదిన్నె : మండల పరిధి సుబ్బన్నగారిపల్లి గ్రామ సమీపంలోని పొలాల వద్ద ఆదివారం రాత్రి కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన కొండపల్లి గంగన్న (57) అనే వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. గంగన్న ఏపీ04 జే 9684 నెంబరు గల టీవీఎస్ స్కూటర్‌లో వచ్చి వెనువెంటనే పెట్రోల్ పోసుకొని కాల్చుకున్నట్లు సమాచారం. ఈ విషయమై చింతకొమ్మదిన్నె ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా గంగన్న కాల్చుకుని మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని, తమ సిబ్బంది వెళ్లి పరిశీలిస్తున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా చింతకొమ్మదిన్నె పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా కొండపల్లి గంగన్న ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి వుంది.

బెల్టు షాపులపై దాడి

లింగాల : మండలంలోని గ్రామాల్లో ఎస్సై అనిల్ కుమార్ బెల్ట్ షాపులపై ఆదివారం దాడులు నిర్వహించారు. చిన్న కుడాల, మురారి చింతల, వెలిదండ్ల, దిగువపల్లి, లింగాల గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అధిక ధరకు అమ్ముతున్న వారిపై దాడులు చేశారు. 47 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. మండలంలో అక్రమ అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దాడుల్లో లింగాల పోలీసులు పాల్గొన్నారు.

చారిత్రక బావి.. అభివృద్ధి చర్యలేవి?

ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ఎంతో చారిత్రకత కలిగి, విశిష్టత ఉన్న దేవాలయం. త్రేతా యుగంలో మృకుండు మహర్షి, శృంగి మహర్షి శ్రీరాముడిని ప్రార్థించడంతో దుష్టశిక్షణ కోసం.. సీతాలక్ష్మణ సమేతుడై అంబుల పొంది, పిడిబాకు, కోదండం పట్టుకుని ఆ ప్రాంతానికి వచ్చి యాగ రక్షణ చేశారని పురాణం చెబుతుంది. అందుకు ప్రతిగా ఆ మహర్షులు సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఏకశిలగా చెక్కించారని, ఆ తరువాత జాంబవంతుడు ప్రాణప్రతిష్ఠ చేశారని ప్రజల విశ్వాసం. ఇక్కడ శ్రీరాముడు కొలువై ఉన్నారని ఎన్నో సందర్భాల్లో రుజువు అయింది. అలాంటిదే ఇమాంబేగ్ బావి కూడా.

- ఒంటిమిట్టలో మరుగునపడ్డ ఇమాంబేగ్ బావి
- స్వామి సాక్షాత్కారానికి గుర్తు
- ముస్లింలు సైతం పూజించేందుకు ఇదే కారణం
- పునరుద్ధరించాలని కోరుతున్న భక్తులు


ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయం

ఒంటిమిట్ట : కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధిగా క్రీ.శ 1640లో ఇమాంబేగ్ పని చేశారు. ఈయన సిద్ధవటం కోటకు వెళ్తూ, ఎండ తీవ్రంగా ఉండటంతో ఒంటిమిట్ట చెరువు సమీపానికి రాగానే.. తన గుర్రానికి చెరువు నీళ్లు తాగించి, తాను కూడా ఒంటిమిట్ట రామాలయం వసారాలలో సేద తీరాడు. ఆ సమయంలో అక్కడున్న వారు దేవుడు ఉన్నాడు, లేడని వాదోపవాదాలు చేసుకుంటున్నారు. అది విన్న ఇమాంబేగ్ దేవస్థానం వాకిలి మూసిన తరువాత బయట నుంచి శ్రీరామచంద్రుని మహిమను స్వయంగా పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు అక్కడ వాదోపవాదాలు చేస్తున్న వారితో ఇలా అన్నాడు. మీ దేవుడు పిలిచినా పలుకునా? అని ప్రశ్నించారు. దీనికి త్రికరణ శుద్ధిగా పిలిస్తే.. తప్పక పలుకునని వారు సమాధానమిచ్చారు. అప్పుడు ఇమాంబేగ్ ఏకాంతంగా తలుపుల దగ్గరకు పోయి ఓ రామ! అని ఇస్లాంలో..

- పరిత్యకుడైన సైతాన్ ప్రలోభముల నుంచి నన్ను రక్షించుము.
- పరమానుగ్రహ శోభితుడును
- ప్రభూ! వరమానుగ్రహ శోభితుడును, సర్వదయాయుడనై భగవంతుని నామంతో జగత్ ప్రభువును కరుణానుగ్రహ మూర్తియు న్యాయ నిర్ణయ దినస్వామియు అగు భగవంతుని స్తుతింతును. నిన్నే మేము పూజింతుము. నిన్నే మేము సాయం కొరకు అర్థింతుము, మాకు రుజు మార్గమును చూపుము అని ఓ రామా! ఓ రఘురామా! ఏకశిలానగరదామా! కోదండ రామా! అని మూడు సార్లు పిలిచాడు. మూడవ సారి అతనికి దివ్య మధురముగా "ఓఓఓ" అనే సమాధానం వినిపించింది. అది విన్న ఇమాంబేగ్ సంతోషంతో మోకరిల్లి అనంద భరితుడై వినయంగా శ్రీస్వామి వారి రూపాన్ని దర్శించి, ఆలయానికి ఆగ్నేయ దిశన బావిని తవ్వించారు.

అభిషేకానికి నీరు సరఫరా

అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి శుక్రవారం ముస్లింలు స్వామిని దర్శిస్తూ వారి కోరికలు సఫలీకృతం చేసుకుంటున్నారు. అంతే కాదు ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులకు ఆ బావి నుంచి అభిషేకానికి నీళ్లు కూడా సరఫరా అయ్యేవి. కుల మతాలకు అతీతంగా, స్వామి సాక్షాత్కారానికి గుర్తుగా నిర్మించిన అంతటి చరిత్ర కలిగిన ఇమాంబేగ్ బావిని మరుగునపడేశారు. క్రమేణ ఆ బావి పూర్తిగా పూడిపోతోంది.

లభించని పురావస్తుశాఖ అనుమతి

ఇమాంబేగ్ బావి ఒంటిమిట్ట రామాలయ చరిత్రలో ఉంది కానీ, భక్తుల సందర్శనానికి నోచుకోలేదు. ఇమాంబేగ్ బావి పునరుద్ధరణ చేయడానికి పురావస్తుశాఖ అనుమతులు లేక పోవడమే కారణమని ఒకపక్క టీటీడీ వారు చెబుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు తలచుకుంటే పురావస్తు శాఖ వారితో కలిసి ఎన్నో చారిత్రక దేవాలయాలను పునరుద్ధరణ చేసిన ఘనత ఉంది. కానీ ఒంటిమిట్టలో భక్తులు సందర్శించి, తెలుసుకోవాల్సిన ఇమాంబేగ్ బావిని, దాని చరిత్రను ఎందుకు కల్పించలేదో అర్థం కావడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇమాంబేగ్ బావిని పునరుద్ధరించి భక్తులకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ మధ్య కాలంలో ఒంటిమిట్ట రామాలయానికి భక్తుల తాకిడి పెంచి, అభివృద్ధి కోసం బృహత్తర ప్రణాళిక రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ వారు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరి ద్వారానైనా రామాలయ చారిత్రక గుర్తులకు పూర్వ వైభవం వస్తుందో లేదో వేచి చూడాలి.


రామాలయ ప్రాంగణంలోని ఇమాంబేగ్ బావి

పునరుద్ధరిస్తాం

ఇమాంబేగ్ బావిని ఎప్పటి నుంచో పునరుద్ధరించాలని చూస్తున్నాం. దీనికి సంబంధించి అనుమతుల కోసం పురావస్తు శాఖ వారి దృష్టికి ఎన్నో సార్లు తీసుకువెళ్లడం జరిగింది. కానీ పురావస్తు శాఖ నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో భక్తులకు తెలియాల్సిన ఇమాంబేగ్ బావి చరిత్ర మరుగునపడింది. పురావస్తు శాఖ అనుమతిస్తే కొన్ని రోజుల్లోనే ఇమాంబేగ్ బావిని పునరుద్ధరిస్తాం.

– అమర్‌నాథ్‌రెడ్డి, టీటీడీ సివిల్ విభాగం ఏఈ, ఒంటిమిట్ట

చరిత్ర అనవాళ్లు కాపాడండి



ఒంటిమిట్ట రామాలయంలో శ్రీరాముడు ఉన్నారనే సత్యాన్ని చూసిన ఇమాంబేగ్ దానికి గుర్తుగా నిర్మించిన బావినే ఇమాంబేగ్ బావి అని పిలుచుకుంటున్నాం. స్వామి ఇక్కడ సాక్షాత్తుగా ఉన్నాడనే సత్యానికి నిదర్శనంగా ఈ బావిని చూపిస్తారు. అలాంటి ఆలయ చారిత్రక అనవాళ్లను కలిగిన ఇమాంబేగ్ బావిని పునరుద్ధరించి భక్తులకు దాని చరిత్ర తెలిసే విధంగా టీటీడీ చర్యలు చేపట్టాలి.

– నారాయణరెడ్డి, శ్రీకోదండ రామాలయం, మాజీ చైర్మన్, ఒంటిమిట్ట

ఎంపీ మిథున్‌రెడ్డికి అరుదైన గౌరవం హర్షణీయం

పీలేరు రూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ తరఫున అరుదైన గౌరవం లభించడం హర్షణీయమని మాజీ డీసీసీబీ డైరెక్టర్ స్టాంపుల మస్తాన్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27న అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి వెళ్లే 16 మంది భారత బృందంలో ఎంపీ మిథున్‌రెడ్డి ఒకరు కావడం విశేషమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బృందాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. పర్యావరణ అభివృద్ధి, శాంతి భద్రతలు, వివిధ అంశాలపై చర్చించడంలో ఎంపీ మిథున్‌రెడ్డికి చోటు కల్పించడం హర్షణీయమని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండాపురం : మండల పరిధి టి.కోడూరు గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తాళ్లప్రొద్దుటూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నట్లు తెలిసింది. జిల్లా సరిహద్దు వద్ద పెన్నానదిలో ఇసుక కోసం కొన్ని ట్రాక్టర్లు ఉండగా.. పోలీసులు వస్తున్నారని గమనించి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

గుర్తుతెలియని మహిళ మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కనుమలోపల్లె రైల్వే మార్గంలో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని రైల్వే పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు... మృతురాలికి 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి వద్ద ప్లాస్టిక్ సంచిలో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఉన్నాయని, ఆ మేరకు ఈమె ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవనం సాగించేదని తెలియవచ్చిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

టైరు పంక్చర్.. కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

పులివెందుల : మండలంలోని గొందిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పులివెందుల వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి సోదరుడు గంగిరెడ్డితో కలిసి సొంత పని మీద కడపకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని పులివెందులకు వస్తుండగా మార్గంమధ్యలో వేముల సమీపంలోని గొందిపల్లె గ్రామ సమీపంలో కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో హాల్ గంగాధర్‌రెడ్డి, గంగిరెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని పులివెందులకు తరలించారు.

పరామర్శించిన వైఎస్ మనోహర్‌రెడ్డి

కారు ప్రమాదంలో గాయపడిన హాల్ గంగాధర్‌రెడ్డి, సోదరుడు గంగిరెడ్డిలను పులివెందుల ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. కార్యక్రమంలో నూరుబాషా సంఘ నాయకులు రసూల్, కౌన్సిలర్ కోడి రమణ, ఖాదర్, పురుషోత్తం, కోఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, హరి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.


ఆసుపత్రిలో సంఘటన వివరాలు తెలుసుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ఎయిర్‌టెల్ టవర్ 24 బ్యాటరీలు చోరీ

కొండాపురం : మండల పరిధి రేగడిపల్లె గ్రామ సమీపంలోని రైల్వే గేట్ దగ్గర ఉన్న ఎయిర్‌టెల్ టవర్‌కు చెందిన 24 బ్యాటరీలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు. ఎయిర్‌టెల్ టవర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు వైద్య పరీక్షల కోసం వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. అతని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో వుంచారు. ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని అధికారులు తెలియజేశారు.

న్యాయం చేయండి


మాట్లాడుతున్న ఎ.శరత్‌బాబు

ప్రొద్దుటూరు : ఓ వ్యక్తి తన నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రిటైర్డు అసిస్టెంట్ పోస్టుమాస్టర్ ఎ.శరత్ బాబు కోరారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడారు. సాక్షి దినపత్రికలో బాధితుల తరఫున గత గురువారం 'ఖాళీ చెక్కుతో కాసుల బేరం' అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడం తనకు సంతోషాన్ని, భరోసాను కలిగించిందని పేర్కొన్నారు. ఇంత కాలానికి జింకా రవి అనే వ్యక్తి గురించి వార్త వచ్చిందన్నారు. తాను కూడా గుర్రప్పస్వామి ఆటో ఫైనాన్స్ ఎండీ జింకా రవి బాధితుడినని తెలిపారు. ప్రొద్దుటూరులో అసిస్టెంట్ పోస్టు మాస్టర్‌గా పని చేస్తూ 2019 ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ పొందానన్నారు. జింకా రవి అవసరం ఉన్న వారికి అప్పులు ఇప్పిస్తుంటాడని తెలుసుకుని 2015లో ఆశ్రయించానన్నారు. జె.సుబ్బరాయుడు, వద్ది ఓబయ్య అనే వ్యక్తులతో ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష డబ్బు ఇప్పించి తన కమీషన్ తీసుకున్నాడన్నారు. తనకు డబ్బు ఇచ్చిన వారికి ప్రామిసరీ నోట్లు రాయించానని తెలిపారు. నెలనెలా డబ్బుకు వడ్డీ ఇప్పించుకోవడం శ్రమతో కూడిన పని అని జింకా రవి తనతో సంతకాలు చేసిన ఆరు చెక్కులు తీసుకున్నాడన్నారు. చెక్కులు వాడలేదని, తాను డైరెక్ట్‌గా వడ్డీ చెల్లించి డబ్బు ఇచ్చిన వారితో సెటిల్ చేసుకున్నానన్నారు. ఖాళీ చెక్కులు ఇవ్వాలని రవిని అడిగితే కనిపించడం లేదని తెలిపాడన్నారు. గుడ్ విల్ కారణంగా అతనిని తాను ఖాళీ చెక్కుల కోసం ఒత్తిడి చేయలేదన్నారు. ఆయన 2017, 2018లో ఒక్కొక్క చెక్కుపై రూ.8 లక్షలు, రూ.10 లక్షలు తాను ఇవ్వాలని చెక్ బౌన్స్ కేసు తనపై వేశాడన్నారు. మరో చెక్కు ఉలసాల చలపతి అనే పేరుతో కేసు వేశాడన్నారు. ఓ చెక్కుకు సంబంధించిన కేసులో తాను ఓడిపోయి రూ.లక్షా 80 వేలు చెల్లించానన్నారు. ఇంకా కోర్టులో మూడు కేసులు ఉన్నాయని తెలిపారు. జింకా రవి పెద్ద సంఖ్యలో అనేక రకాల ప్రభుత్వ ఉద్యోగులపై ప్రొద్దుటూరు కోర్టులో కేసులు ఫైల్ చేశారన్నారు. దువ్వూరులో పని చేస్తున్న యనమల సుబ్బరాయుడు అనే ఉపాధ్యాయుడు ఇలా వేధింపులకు గురై చివరకు గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమతి లేకుండా సిజేరియన్ ఆపరేషన్లు

వైద్యుడిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు


వైద్యుడు విజయ్‌కుమార్

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో ఉన్న అరుణ హాస్పిటల్‌లో అనుమతులు లేకుండా అక్కడున్న(డీహెచ్ఎంహెచ్) వైద్యుడు విజయ్‌కుమార్ గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు చేస్తుండగా పట్టుబడినట్లు సీఐ నరసింహులు తెలిపారు. ఆదివారం డిప్యూటీ డీఎంహెచ్ ఖాజా మొహినిద్దీన్ ఫిర్యాదు మేరకు వైద్యులు విజయ్‌కుమార్‌పై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గత నెలలో ఎటువంటి అనుమతులు లేకుండా గర్భిణులకు ఆపరేషన్లు చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో.. ఆ హాస్పిటల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారన్నారు. అయినా కూడా హాస్పిటల్ వైద్యులు, వైద్య ఉన్నతాధికారులను లెక్క చేయకుండా సీజ్ చేసిన ల్యాబ్‌ను ఓపెన్ చేసి.. మరలా యథావిధిగా శనివారం రాత్రి ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు చేస్తుండగా డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజా మోహినిద్దీన్ తనిఖీ నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐ నరసింహులు విచారణ చేసి వైద్యునిపై కేసు నమోదు చేశామని వివరించారు.


ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన ఖైరున్నీసా

పీలేరు రూరల్ : ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పీలేరు పట్టణం బోయపాలెం వీధిలో కాపురం ఉంటున్న నాసిర్ భార్య ఖైరున్నీసా (48) అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యం కోసం రోజూ నడుద్దాం

డీఎస్పీ కె.మహేంద్ర


మల్లయ్యకొండకు బృందంగా నడుస్తున్న డీఎస్పీ మహేంద్ర, పోలీసులు

మదనపల్లె రూరల్ : 'ఆరోగ్యమే మహాభాగ్యం. మెరుగైన ఆరోగ్యం పొందాలంటే ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో నడకను అలవాటు చేసుకోవాలి. అప్పుడే అద్భుతమైన ప్రయోజనాలు పొందగలం' అంటూ డీఎస్పీ కె.మహేంద్ర తెలిపారు. ప్రతిరోజు కేసులు, ఇన్వెస్టిగేషన్, డ్యూటీల పేరుతో క్షణం తీరిక లేకుండా గడిపే పోలీసులు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం కొత్తగా ఏదైనా చేద్దామని తలచారు. తలచిందే తడవు, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అనుమతితో, డీఎస్పీ మహేంద్ర సారథ్యంలో.. మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం వేకువజామున ఒక్కొక్కరుగా పోలీసు సిబ్బంది మల్లయ్యకొండ కిందకు చేరుకున్నారు. అందరూ కలిసికట్టుగా కొండ ఎక్కేందుకు బయలుదేరారు. కొండ ఎక్కే క్రమంలో చుట్టూ ప్రకృతి అందాలను చూడటంతోపాటు అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి లేలేత కిరణాలను చూస్తూ, పిల్లగాలుల శబ్దాలను ఆలకిస్తూ మైమరచిపోయారు. కొండ ఎక్కడంలో అలసిన ఖాకీలు ఓ చోట సేద తీరేందుకు నిలిస్తే... డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు కఠినమైనవని, ఆరోగ్యం కాపాడుకోవడం అంటే, కుటుంబం, సమాజం కోసం బలంగా నిలవడం, శారీరకంగా, మానసికంగా బలంగా ఉండటమని ఉత్సాహాన్ని నింపారు. దీంతో రెట్టింపైన ఉత్సాహంతో సిబ్బంది ముందుకు సాగి మల్లయ్యకొండకు చేరుకున్నారు. కొండపై నుంచి మదనపల్లె పట్టణ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించి, సెల్ఫీలు తీసుకుని కాసేపు సరదాగా గడిపారు. ట్రెక్కింగ్‌లోని అనుభవాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి తెలిపితే.. ఆయన పోలీస్ సిబ్బంది ప్రయత్నాన్ని హర్షించడమే కాకుండా, ఆదివారం ఆరోగ్యం కోసం పోలీసులు వేసిన అడుగు.. ఐక్యతకు సంకేతం కావాలని, పోలీసు కుటుంబంలో కొత్త ఉత్సాహాన్ని నింపాలంటూ సందేశం పంపారు. మల్లయ్యకొండకు ట్రెక్కింగ్ చేసిన వారిలో సీఐలు కళావెంకటరమణ, రమేష్, ఎస్ఐలు అన్సర్‌బాషా, చంద్రమోహన్, తిప్పేస్వామి ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు మంత్రిత్వ శాఖ అవసరం



మాట్లాడుతున్న ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వీరారావ్

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజెన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వీరారావ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జిల్లా అధ్యక్షులు మునిగోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరారావ్ మాట్లాడుతూ వృద్ధులపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు రాసే సమయంలో తమను సక్రమంగా చూసుకుంటేనే ఆస్తి చెందేలా వీలునామా రాయాలన్నారు. దీంతో తల్లిదండ్రులను పిల్లలు సక్రమంగా చూసుకుంటారన్నారు. ఆస్తి కోసం తల్లిదండ్రులపై జరిగే దాడులు, హత్యలు నివారించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. 2007 చట్టం సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఆనంద వృద్ధాశ్రమం ఆనంద్, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ పరంధామగౌడ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.వి.నాయుడు, గౌరవ అధ్యక్షులు వై.ఎస్.మునిరత్నమయ్య, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్, తిరుపతిరావు నాగరాజు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, మహిళా ప్రతినిధి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్ : బైక్ అదుపు తప్పి ఇద్దరు కర్ణాటక వాసులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కర్ణాటక హవేరి ప్రాంతానికి చెందిన మల్లికార్జున(33), కనకపురకు చెందిన ముత్తురాజ్(32) ఎలక్ట్రానిక్ సిటీలో డీమార్ట్‌లో పని చేస్తుంటారు. ఇద్దరూ కలిసి శనివారం ద్విచక్రవాహనంలో తిరుమల స్వామివారి దర్శనానికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరుమల నుంచి బెంగళూరుకు బైక్‌లో తిరుగుప్రయాణం అయ్యారు. మార్గంమధ్యలో తిరుపతి–మదనపల్లె హైవేలోని పాలెంకొండ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ముత్తురాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మణికంఠ మృతదేహం

కలికిరి(వాల్మీకిపురం) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన శనివారం రాత్రి వాల్మీకిపురం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మదనపల్లి పట్టణం ఈశ్వరమ్మకాలనీకి చెందిన నాగయ్యగారి మణికంఠ(27) తన ద్విచక్రవాహనంలో తిరుపతికి వెళ్లి మదనపల్లికి తిరుగు పయనమయ్యారు. మార్గంమధ్యలో వాల్మీకిపురం మండలం చింతలవారిపల్లి వద్ద తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారిపై బైక్, ముందు వెళుతున్న వాటర్ ట్యాక్టరు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వాల్మీకిపురం పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు


మృతి చెందిన నజీర్ హుస్సేన్


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ(నంద్యాల జిల్లా) : అతి వేగం, అపై నిద్రమత్తు ఒకరిని బలితీసుకుంది. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని గూబగుండం మెట్ట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన పిచ్చిరెడ్డి తిరుపతిలోని ఓ కారు షోరూంలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొత్త కారును కొనుగోలు చేయడంతో పిచ్చిరెడ్డి ఆ కారును డెలివరీ ఇచ్చేందుకు శనివారం అర్ధరాత్రి తర్వాత బయలుదేరాడు. మార్గంమధ్యలో కడప దగ్గర నంద్యాలకు వెళ్లేందుకు నజీర్ హుస్సేన్, శ్రీను అనే ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఈ క్రమంలో ఆళ్లగడ్డ పట్టణ శివారులోని గూబగుండం మెట్ట సమీపంలోకి వచ్చేసరికి.. కారు నడుపుతున్న పిచ్చిరెడ్డి నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న నజీర్‌హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందగా పిచ్చిరెడ్డి, శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నంద్యాల వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన నజీర్ హుస్సేన్ కడప వాసిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.